క్లుప్తంగా

నూకాంబిక ఆలయంలో ప్రత్యేక పూజలు



భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న ఆడారి హరీష్

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు ఇందిరా కాలనీలోని నూకాంబిక అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమావాస్య సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక పూజలు చేపట్టారు. అమ్మవారిని పంచామృతాలతో అభిషేకించి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. పలు పిండి వంటలను,పండ్లు సమర్పించారు. మధ్యాహ్నం కమిటీ నిర్వాహకులు అన్న ప్రసాదాలు వడ్డించారు. పూజా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు ఆడారి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఎల్లో బెల్ట్ ప్రదానం



కరాటేలో ఎల్లో బెల్టు పొందిన విద్యార్థులు

మల్కాపురం: చూసీఏ అకాడమీ ఆధ్వర్యంలో 10 ఏళ్ల లోపు వారికి నగరంలో నిర్వహించిన కరాటే పోటీల్లో శ్రీహరిపురంలో భాష్యం పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. పాఠశాల నుంచి పాల్గొన్న 15 మంది విద్యార్థులు ఎల్లో బెల్ట్ (పసుపు రంగు) పొందారు. వీరిని శుక్రవారం పాఠశాల ప్రిన్సిపాల్,ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

విశాఖ చేరుకున్న రాష్ట్ర మంత్రులు



ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వస్తున్న మంత్రులు బొత్స సత్యనారాయణ, అమర్‌నాథ్

గోపాలపట్నం: అసెంబ్లీ సమావేశాల అనంతరం విశాఖలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర మంత్రులు విశాఖ చేరుకున్నారు. ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఐటీ పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్, రెవెన్యూ శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు శుక్రవారం ఉదయం ఇండిగో విమానంలో గన్నవరం నుంచి విశాఖ వచ్చారు. వీరికి వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు స్వాగతం పలికారు.

చెట్టును ఢీకొన్న బైక్.. ఒకరు మృతి

కూర్మన్నపాలెం: బైక్ అదుపు చేయలేక చెట్టుకు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు తెలిపిన వివరాలివీ.. కూర్మన్నపాలెం రాజీవ్‌నగర్ ప్రాంతానికి చెందిన చింతలపాటి మోహన్‌కుమార్(33) పరవాడలోని ఠాగూర్ లేబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో అసిస్టెంట్ ప్రొడక్షన్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. గురువారం జనరల్ షిఫ్ట్ డ్యూటీకి వెళ్లిన మోహన్ అనారోగ్యం కారణంగా మధ్యాహ్నం అనుమతి తీసుకుని ఇంటికి తిరిగి వచ్చేశాడు. రాత్రి స్నేహితుడి ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి బైక్‌పై బయలుదేరాడు. తిరిగి అర్ధరాత్రి సమయంలో అగనంపూడి నుంచి రాజీవ్‌నగర్ వైపు బయలుదేరాడు. ఈ క్రమంలో తాను నడుపుతున్న బైక్‌ను అదుపు చేయలేక చెట్టును ఢీకొనడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. ఈ ఘటనలో మోహన్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతని స్నేహితుల ద్వారా సమాచారం అందుకున్న భార్య ప్రవంతి.. భర్త మృతదేహాన్ని చూసి బోరున విలపించింది.

ముందడుగు..!

- 60 అడుగుల రోడ్డు విస్తరణకు కసరత్తు
- స్థల సమస్యకు పరిష్కారం చూపిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- ఎయిర్‌పోర్టు అథారిటీకి భోగాపురం వద్ద ప్రత్యామ్నాయ స్థలం కేటాయింపు
- రూ.4 కోట్లతో రహదారి విస్తరణకు ప్రతిపాదనలు



నేతాజీనగర్ వద్ద ఇరుగ్గా రహదారి



హైవే నుంచి పాసుపోర్టు కార్యాలయం పక్కగా బీఆర్టీఎస్‌కు వెళ్లేందుకు ప్రస్తుతం ఉన్న రహదారి

విశాఖ విద్య: జాతీయ రహదారి (పాస్‌పోర్టు కార్యాలయానికి ఆనుకుని)నుంచి మర్రిపాలెం నేతాజీనగర్ మీదగా బీఆర్టీఎస్(కంచరపాలెం) వైపు వెళ్లే రహదారి విస్తరణకు అడుగులు ముందుకుపడుతున్నాయి. జీవీఎంసీ మాస్టర్ ప్లాన్‌లో ఉన్నప్పటికీ మూడు దశాబ్దాలుగా రహదారి విస్తరణకు నోచుకోలేదు. ఎన్నో ఏళ్ల నుంచి నలుగుతున్న రహదారి విస్తరణ సమస్యపై డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. విస్తరణకు ప్రతిపాదించిన స్థలం ఎయిర్ పోర్టు అథారిటీ పరిధిలో ఉండడంతో సమస్యను ప్రభుత్వ పెద్దల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మూడు దశాబ్దాలకు పైగా నలుగుతున్న సమస్యకు గ్రహణం వీడింది. రోడ్డు విస్తరణకు అవసరమైన స్థలాన్ని ఎయిర్‌పోర్టు అథారిటీ నుంచి జీవీఎంసీ తీసుకొని ప్రత్యామ్నాయంగా భోగాపురం ఎయిర్ పోర్టు వద్ద వారికి స్థలం కేటాయించడానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తదుపరి చర్యల నిమిత్తం ఎయిర్ పోర్టు అథారిటీ డైరక్టర్‌కు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తాజాగా లేఖ రాశారు. దీంతో ఈ ప్రాంత వాసుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

మాస్టర్‌ప్లాన్‌లో భాగం

హైవే మార్గంలో వచ్చే వాహనాలు మర్రిపాలెం వైపు ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్ మీదుగా వెళ్లాలి. పాసుపోర్టు ఆఫీసు పక్క నుంచి బీఆర్టీఎస్ రహదారికి కనెక్టివిటీగా 60 అడుగుల రోడ్డు విస్తరిస్తే ఫ్లై ఓవర్ వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే మర్రిపాలెం చేరుకోవచ్చు. అంతే కాకుండా ఈ రహదారికి ఇరువైపులా ఉన్న కాలనీ వాసుల ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. దీంతో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని నేషనల్ హైవే నుంచి పాసుపోర్టు కార్యాలయం పక్కగా బీఆర్టీఎస్ రోడ్డుకు అనుసంధానంగా ప్రస్తుతం ఉన్న రహదారిని 60 అడుగల మేర విస్తరించాలని జీవీఎంసీ మాస్టర్‌ప్లాన్‌లో పొందుపరిచారు.

రూ.4 కోట్లతో రహదారి విస్తరణ

పాసుపోర్టు కార్యాలయం పక్క నుంచి హైవే–బీఆర్టీఎస్ రోడ్డుకు ప్రస్తుతం కొన్ని చోట్ల 20 అడుగులు, కొంతమేర 30 అడుగుల రహదారి ఉంది. ఈ రహదారి సుమారు కిలోమీటర్ దూరం ఉంటుంది. దీనికి ఒక వైపు నివాస గృహాలు, మరో వైపు ఎయిర్ పోర్టు అథారిటీకి చెందిన స్థలం ఉంది. ఎయిర్‌పోర్టు అథారిటీ స్థలం తీసుకొని 60 అడుగుల రోడ్డుగా విస్తరించేందుకు అంతా సిద్ధమవుతోంది. ఇందుకోసం జీవీఎంసీ ద్వారా రూ.4 కోట్లతో ప్రతిపాదనలు సైతం చేశారు. రహదారి విస్తరణ, మోడల్ లైటింగ్, గ్రీనరీ వంటి పనులు చేపట్టనున్నారు.



బీఆర్‌టీఎస్ రోడ్డు వైపు ఇదీ పరిస్థితి



మాస్టర్ ప్లాన్

త్వరలో పనులు ప్రారంభం



పాసుపోర్టు కార్యాలయం పక్క నుంచి 60 అడుగుల రోడ్డు విస్తరణ గురించి సీఎం జగన్ మోహన్ రెడ్డికి విన్నవించాను. దీనికి ఇంత తొందరగా ఆమోదం లభిస్తుందని అనుకోలేదు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ ఎంతో చొరవ తీసుకున్నారు. ఎయిర్‌పోర్టు అథారిటీ, జిల్లా అధికారులు, జీవీఎంసీ అధికారులతో త్వరలో కో–ఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేస్తున్నాం. ఆ వెంటనే రహదారి విస్తరణ పనులు చేపట్టనున్నాం.

– జియ్యాని శ్రీధర్, డిప్యూటీ మేయర్

సీఎంకు ధన్యవాదాలు



నేతాజీనగర్ రోడ్డును 60 అడుగుల మేర విస్తరించాలని ఎన్నో సంవత్సరాలుగా డిమాండ్ చేస్తున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో దీనికి మోక్షం కలిగింది. సీఎంకు ఈ ప్రాంత వాసులమంతా రుణపడి ఉంటాం. పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ కృషి దీనిలో ఎంతో ఉంది.

– బీఎస్.కృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్

చాలా సంతోషం



పాస్ పోర్టు కార్యాలయం పక్కన గల రహదారిని 60 అడుగుల మేర విస్తరించాలని ఎన్నో సంవత్సరాల నుంచి కోరుతున్నాం. కానీ ఎవరూ దీన్ని పట్టించుకోలేదు. ఇన్నాళ్లకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సమస్యకు పరిష్కారం లభించింది. చాలా సంతోషంగా ఉంది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనులు చేపట్టే ప్రభుత్వాలకు తప్పకుండా ప్రజాదరణ ఉంటుంది.

– నాగేశ్వరరావు, వుడా వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు

సీఎంను కలిసిన డిప్యూటీ మేయర్ శ్రీధర్



సీఎంకు అభివాదం చేస్తున్న శ్రీధర్

విశాఖ విద్య: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని శుక్రవారం ఢిల్లీలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మర్యాద పూర్వకంగా కలిశారు. జీవీఎంసీ పరిధిలో పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వాటిపై సీఎం జగన్ మోహన్ రెడ్డి సానుకూలంగా స్పందించారని డిప్యూటీ మేయర్ శ్రీధర్ తెలిపారు. అదే విధంగా వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని కూడా కలిసి సత్కరించారు.

కనులపండువగా కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ట



ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీయాదవ్ తదితరులు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు కొత్త నక్కవానిపాలెంలోని దుర్గాదేవి ఆలయంలో కనకదుర్గ అమ్మవారి విగ్రహం,కలశ ప్రతిష్ఠ శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహంతో పాటు నదీ జలాలతో కూడిన కళశాలను మహిళలు జింక్ నుంచి కొత్త నక్కవానిపాలెం వరకు ఊరేగింపుగా ఆలయానికి తీసుకు వచ్చారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. పూజల్లో వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీయాదవ్, పుర్రె సురేస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



చిన్నారికి మాత్ర వేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త



నులిపురుగు నివారణ మాత్ర వేస్తున్న సురేష్‌యాదవ్

మల్కాపురం: చిన్నారులు కడుపు నొప్పితో బాధపడితే నిర్లక్ష్యంగా చేయకుండా వైద్యులకు చూపించాలని వైఎస్సార్‌టీయూసీ నాయకుడు పుర్రె సురేష్‌యాదవ్ అన్నారు. నులిపురుగు నివారణ దినోత్సవం సందర్భంగా 59వ వార్డు గణపతినగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సురేష్‌యాదవ్ విద్యార్థులతో మాత్రలు మింగించారు. కార్యక్రమంలో ఏఎస్ఎం కనకమహాలక్ష్మి, ఉపాధ్యాయురాలు చంద్రకళ, పార్టీ నాయకులు సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

52వ వార్డులో..

విశాఖ విద్య: నులిపురుగుల నివారణలో భాగంగా శుక్రవారం 1 నుంచి 19 ఏళ్ల లోపు వారికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. జీవీఎంసీ 52వ వార్డు గణేష్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాత్రలను మింగించారు. విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో కేంద్రం కార్యకర్త మార్త మాత్రలను పంపిణీ చేశారు. జీవీఎంసీ 52,90వ వార్డుల పరిధిలోని అన్ని అంగన్ వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కాలేజీల్లో నులిపురుగుల నివారణ కార్యక్రమం జరిగింది.

చర్చి నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు హుద్‌హుద్‌కాలనీలో వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సొంత నిధులతో నిర్మిస్తున్న చర్చి పనులను శుక్రవారం వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక భవనం ప్రారంభోత్సవానికి ఆనంద్‌కుమార్ విచ్చేసిన సమయంలో స్థానిక పాస్టర్లు చర్చి చిన్నదిగా ఉందని, మరుగుదొడ్లు కూడా లేవని చెప్పడంతో స్పందించిన ఆనంద్‌కుమార్ తన సొంత నిధులతో చర్చి అదనపు గదులు , మరుగుదొడ్ల సదుపాయం కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు పనులు చేపడుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పారిశ్రామిక ప్రాంత స్పిరిట్ ఆఫ్ యూనిటీ పాస్టర్స్ ఫెల్లోషిప్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ చింతా ప్రభాకర్, అధ్యక్షుడు ఎస్‌బీ సింగ్, కార్యదర్శి భూషణం, కోశాధికారి ఇస్రాయెల్‌రాజు, నాయకులు నక్కా సూర్యనారాయణ, బాబూరావు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

16న సమ్మె విజయవంతం చేయాలి



ఆటోనగర్‌లో రైల్వే వ్యాగన్ రిపేర్ వర్క్‌షాపు వద్ద ఆందోళన చేస్తున్న సిటూ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక నాయకులు

అక్కిరెడ్డిపాలెం: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న దేశవ్యాప్తంగా చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలని సిటూ జిల్లా కమిటీ సభ్యుడు జగ్గునాయుడు కోరారు. ఆటోనగర్‌లోని రైల్వే వ్యాగన్ రిపేర్ వర్క్ షాపు ఎదుట సిటూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో ఆయన మాట్లాడారు. బీజేపీ పాలనలో కార్మిక వర్గం, పేదలు, రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నరేంద్ర మోదీ ధనికులకు లక్షల కోట్లు ఆదాయాన్ని సమకూర్చే విధంగా పరిపాలన సాగిస్తున్నారన్నారు. రైల్వే వ్యాగన్ రిపేర్ వర్క్ షాపు కంపెనీలో 500 కార్మికులు పని చేస్తున్నారని, వారికి ఈఎస్‌ఐ, ఈపీఎఫ్, సేఫ్టీ పరికరాలు, సమాన పనికి సమాన వేతనం వంటివి అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో సిటూ జిల్లా కమిటీ సభ్యుడు రాంబాబు, అవతారం, రాజు, వెంకటేశ్వరరావు, సురేష్, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశంలో..

ఉక్కునగరం: దేశవ్యాప్తంగా ఉన్న కార్మికులు, ప్రజల సమస్యల పరిష్కారానికి ఈ నెల 16న నిర్వహించనున్న గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని ఉక్కు కార్మిక నాయకులు కోరారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి ఏఐటీయూసీ పాయింట్ వద్ద శుక్రవారం నిర్వహించిన అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశంలో నాయకులు మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ స్ట్రాటజిక్ సేల్ ఆపాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, ఉక్కు కార్మికులకు నూతన వేతనాలు అమలు చేయాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, అధిక ధరలు తగ్గించాలన్న డిమాండ్లపై దేశవ్యాప్తంగా జరుగుతున్న బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు.

కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక నాయకులు కె.ఎస్.ఎన్. రావు, జె.అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, కర్రి దాలినాయుడు, జె.రామకృష్ణ, సన్యాసిరావు సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలపై ర్యాలీ



ధర్నాలో పాల్గొన్న పెన్షనర్లు

విశాఖ విద్య: పెన్షనర్ల సమస్యలు పరిష్కారం కోరుతూ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా ఐదో రోజుకు చేరింది. శుక్రవారం పెన్షనర్లు మర్రిపాలెం సెంటర్ నుంచి పీఎఫ్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. పీఎఫ్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు బీటీ మూర్తి, అధ్యక్షులు దీనబంధు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కే హుస్సేన్ మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. రైల్వే రాయితీలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అజయ్ శర్మ, వివిధ పరిశ్రమలకు చెందిన పెన్షనర్‌సంఘాల నాయకులు సూరినాయుడు, చంద్రశేఖర్, అప్పలరాజు,బాబాజీ తదితరులు ప్రసంగించారు.

విద్యాశాఖ మంత్రిని కలిసిన యూనిట్ టీం

అక్కిరెడ్డిపాలెం: సమగ్ర శిక్షలోని పార్ట్ టైం టీచర్లను ఒకేషనల్ టీచర్లుగా మార్పు చేస్తున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారని జిల్లా యూనిట్ టీం అధ్యక్షుడు రవిచంద్ చెప్పారు. అక్కిరెడ్డిపాలెం హైస్కూల్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. 23 శాతం జీతం పెరుగుదల జీవో విడుదల చేసిన సందర్భంగా ఆయనతో పాటు యూనిట్ టీం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శంకర్, జిల్లా యూనిట్ టీం కార్యదర్శి కె.శ్రీనివాసరావు మంత్రిని కలిసి ధన్యవాదాలు చెప్పారు. ఉపాధ్యాయుల మిగిలిన అంశాలు కూడా త్వరలో పరిష్కరిస్తామని మంత్రి చెప్పినట్లు రవిచంద్ ఓ ప్రకటనలో తెలిపారు.

నేటి నుంచి దక్షిణ భారత హిందీ పరీక్షలు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ–చెన్నై ఆధ్వర్యంలో నిర్వహించే లోయర్, హయ్యర్ హిందీ పరీక్షలు శని, ఆదివారాల్లో భీమిలి నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్‌లో జరగనున్నాయి. ఆదివారం లోయర్ విద్యార్థులకు పరీక్షలు జరుగనున్నాయి. పరీక్షలకు ఏర్పాట్లు చేసినట్టు ప్రధానోపాధ్యాయురాలు ఎం.తిరుమల శ్రీదేవి తెలిపారు. హాల్ టికెట్లు కూడా పంపిణీ చేశారు.

ఎన్నికలకు సిద్ధం కండి



మాట్లాడుతున్న జేసీఎస్ కన్వీనర్ పిల్లా కన్నబాబు

మల్కాపురం: వచ్చే ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడించడానికి శ్రేణులు సన్నద్ధం కావాలని జీవీఎంసీ 58,59,60వ వార్డుల జేసీఎస్ కన్వీనర్ పిల్లా కన్నబాబు అన్నారు. 58వ వార్డు పిలకవానిపాలెంలో శుక్రవారం బూత్ స్థాయి నాయకులతో సమావేశం నిర్వహించారు. వార్డు పార్టీ అధ్యక్షుడు దాట్ల శ్రీనివాసరాజు అధ్యక్షత జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని బూత్ స్థాయి నాయకులకు పలు సూచనలు చేశారు.పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు ప్రవేశ పెట్టి వారిని ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించారన్నారు. పథకాల ద్వారా మీ పరిధిలో ప్రజలు పొందిన లబ్ధిని వివరించాలని సూచించారు. కొద్ది రోజుల్లో ఎన్నికలు రానున్నాయని.. నియోజకవర్గం నుంచి ఆడారి ఆనంద్‌కుమార్‌ను అధిక మెజారిటీతో గెలిపించి సీఎం వైఎస్ జగన్‌కు కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బూత్ స్థాయి నాయకులు,గృహసారథులు,సచివాలయాల కన్వీనర్లు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత



హెచ్‌పీసీఎల్ సెక్యూరిటీ ఆఫీసర్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న భోగవల్లి నాగభూషణం

మల్కాపురం: ఈ నెల 16న దేశవ్యాప్తంగా జరగనున్న సమ్మెను కార్మికులంతా జయప్రదం చేయాలని ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం పిలుపునిచ్చారు. సమ్మెకు సహకరించాలని కోరుతూ హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ) సంస్థ సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ విజయ్‌కుమార్‌కు శుక్రవారం భోగవల్లి సమ్మెకు సంబంధించిన నోటీస్ అందించారు.

హెచ్‌పీసీఎల్ సీ గేటు వద్ద జరిగిన కార్యక్రమంలో భోగవల్లి మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మికుల పట్ల అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న దేశవ్యాప్తంగా సమ్మె చేస్తునట్టు వివరించారు. దీనికి కార్మికులంతా సహకరించాలని ఆయన కోరారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణతో పాటు దేశంలోని వివిధ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్న బీజేపీ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ అఖిల పక్ష కార్మిక సంఘాలు ఈ సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు.

1093వ రోజుకు ‘ఉక్కు’ దీక్షలు



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు కార్మికులు పట్టు వదలక చేస్తున్న పోరాటానికి కేంద్ర ప్రభుత్వం సమాధానమివ్వాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1093వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలువురు కార్మికులు కూర్చుని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముతూపోతే భారతదేశంలో ఏ ప్రభుత్వరంగ సంస్థ మిగలదన్నారు. ఇప్పటికే దేశంలో కొత్త పరిశ్రమలు ఏర్పాటు కాక, నిరుద్యోగ సమస్యతో యువత వ్యసనాలకు బానిసలవుతున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తామన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు, కార్మికులంతా ఐక్యంగా ఉంటూ ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



యజ్ఞోపవీత ధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.